ఈనాడు
అల్లూరి సీతారామరాజు
మంగళవారం 1 అక్టోబరు 2024

మాదిమళ్లు.. దమ్ముంటే జారకుండా వెళ్లు



బురదమయంగా మాదిమళ్లు రహదారి



ద్విచక్రవాహనదారుడి పాట్లు

గూడెంకొత్తవీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ మాదిమళ్లు రహదారి అస్తవ్యస్తంగా మారింది. గతనెల 8న కురిసిన భారీ వర్షాలకు రహదారి ఛిద్రంగా మారింది. తక్షణ చర్యల్లో భాగంగా గుత్తేదారు వచ్చి మట్టిపోసి వెళ్లిపోయారు. సోమవారం కురిసిన భారీ వర్షానికి రహదారి అంతా బురదమయంగా మారి రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. కనీసం అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి ఈ రహదారిని బాగు చేయించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు. – సీలేరు, న్యూస్‌టుడే

ఖాతాలో 49 కోట్లు.. వాడుకోడానికి పాట్లు!

★ ఉమ్మడి జిల్లా ఖనిజాభివృద్ధి నిధుల తీరిది..
★ అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు దక్కని వాటా

ఈనాడు, పాడేరు, అనకాపల్లి

గనుల శాఖ ఖాతాల్లో జిల్లా ఖనిజాభివృద్ధి నిధులు (డీఎంఎఫ్) కనిపిస్తున్నా ఖర్చుచేయడానికి అవకాశం లేకుండాపోతోంది. వైకాపా ప్రభుత్వ అనాలోచిత చర్యల కారణంగా రూ.కోట్ల సొమ్ములు ఖాతాల్లోనే మగ్గుతున్నాయి. జిల్లాల విభజనకు ముందు ఉమ్మడి జిల్లా ఖాతాలో రూ.49 కోట్ల డీఎంఎఫ్ నిధులున్నాయి. వీటిని విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు సమానంగా పంచాల్సి ఉన్నా నాటి సర్కారు నిర్వాకంతో వీలుకాలేదు.



గత పాలకులు గనుల శాఖలో ఇష్టానుసారంగా నియామకాలు చేపట్టారు. ఉత్తర్వుల్లో పోస్టింగ్ ఒకచోట.. విధులు నిర్వహించేది మరొకచోట కావడంతో ఈ నిధులు ఉమ్మడి ఖాతా దాటలేకపోయాయి. కూటమి ప్రభుత్వంలో ఇటీవలే బదిలీలు పూర్తయ్యాయి. కొత్త అధికారులైనా ఈ నిధుల పంపకాలకు చర్యలు తీసుకుంటే వాటితో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు పట్టాలెక్కడానికి అవకాశం ఉంటుంది.

గనులు, క్వారీల లీజుదారులు సీనరేజి ఛార్జీల్లో 30 శాతం డీఎంఎఫ్‌గా చెల్లించాల్సి ఉంటుంది. ఇలా 2019 నుంచి 2022 జూన్ వరకు సుమారు రూ.55.69 కోట్లు ఉమ్మడి జిల్లాకు అందుబాటులోకి వచ్చాయి. కొవిడ్‌లో ఖర్చుల కోసమని రూ.6.69 కోట్లు మళ్లించారు. మిగతా రూ.49 కోట్లను మూడు జిల్లాలకు రూ.16 కోట్ల చొప్పున పంపకాలు చేయాల్సి ఉంది. 2022 జూన్ తర్వాత ఏ జిల్లా పరిధిలో ఉన్న గనుల నుంచి వచ్చే డీఎంఎఫ్ ఆ జిల్లా ఖాతాలోనే జమ అవుతున్నాయి. ఉమ్మడి జిల్లా ఖాతాలో రెండేళ్లుగా మగ్గుతున్న నిధుల పంపకానికి మాత్రం మోక్షం లేకుండా పోయింది. ఈ నిధులతో గతంలో ప్రతిపాదించిన పనులు కొన్ని అసంపూర్తిగా నిలిచిపోగా చాలావరకు ప్రారంభమే కాలేదు.

పోస్టింగ్ ఒకరు.. విధుల్లో మరొకరు

విశాఖ జిల్లా గనుల శాఖల ఉప సంచాలకుడిగా గంజి వెంకటేశ్వర్లును రెండేళ్ల క్రితం నియమించినా ఈయన ప్రధాన కార్యాలయంలోనే ఉండిపోయారు. డీఈవీఈఎస్ఎన్ రాజు, వెంకటకృష్ణ ఇన్‌ఛార్జులుగా పనిచేశారు. వీరు పర్యవేక్షణకే తప్ప జీతభత్యాలు, ఇతర బిల్లుల ఆమోదం అంతా విజయవాడ నుంచి వెంకటేశ్వర్లే చూసుకునేవారు. డీఎంఎఫ్ సొమ్ములు కూడా ఆయనే అనకాపల్లి, అల్లూరి జిల్లాల ఖాతాలకు సర్దుబాటు చేయాలి. అలా జరగాలంటే అప్పటి డీఎంఎఫ్ చలానాలన్నింటికీ వెంకటేశ్వర్లు బయోమెట్రిక్ వేయాలి. వేల సంఖ్యలో బయోమెట్రిక్ వేయాల్సి ఉండడంతో పంపకాలను పట్టించుకోలేదు.



వైకాపా హయాంలో కశింకోట వద్ద డీఎంఎఫ్ నిధులతో వంతెన నిర్మాణానికి వేసిన శిలాఫలకం..

ప్రభావిత గ్రామాలపై ఖర్చుచేయాలి..

గనుల తవ్వకాలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావితమయ్యే 10 నుంచి 25 కి.మీ పరిధిలోని గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఈ నిధులను వినియోగించాలి. 2014-19 మధ్యలో ఈ నిధులను జిల్లా అధికారులు బాగానే ఉపయోగించుకున్నారు. వైకాపా హయాంలోనే ఈ సొమ్ములను వినియోగించుకోలేకపోయారు. ఈ విషయమై గనుల శాఖ పూర్వ ఉప సంచాలకులు, పాడేరు జిల్లా మైనింగ్ అధికారి డీఈవీఎస్ఎన్ రాజు వద్ద ప్రస్తావించగా 'బదిలీపై విశాఖ జిల్లాకు వచ్చే కొత్త అధికారి చొరవ తీసుకుంటే మూడు జిల్లాలకు సమానంగా సొమ్ములు పంచడానికి వీలవుతుంది. త్వరలోనే ఈ పంపకాలు జరుగుతాయని ఆశిస్తున్నాం' అని వివరించారు.

కొట్టుకుపోయిన కల్వర్టు.. నిలిచిన రాకపోకలు



చీడిమెట్ట వద్ద కల్వర్టు ఇలా..

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: అనంతగిరి మండలం పినకోట, పెదకోట, కివర్ల పంచాయతీల పరిధిలోని బోనూరు- చీడిమెట్ట, పూతికపుట్టు- జగడాలమామిడి వద్ద కల్వర్టులు ఇటీవల వర్షాలకు కొట్టుకుపోయాయి. మూడు పంచాయతీల్లోని గిరిజన గ్రామాలను కలుపుతూ వేసిన రింగ్ రోడ్డు సైతం వర్షాలకు పాడైంది. రాకపోకలకు గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. 2021-22లో రూ.16 కోట్ల వ్యయంతో ఈ రహదారి పనులు ప్రారంభించారు. నిర్మాణం పూర్తవకుండానే కల్వర్టులు ధ్వంసమయ్యాయి. అధికారులు స్పందించి రాకపోకలకు ఇబ్బందులేకుండా చూడాలని గిరిజనులు కొండబాబు, వెంకటరావు, సత్యారావు తదితరులు కోరుతున్నారు.

రహదారిపై గుదిబండలు



డుంబ్రిగుడ మండలంలో జాతీయ రహదారి నిర్మాణ పనులతో ప్రమాదం పొంచి ఉంది. కరిడి సమీపంలో బండరాళ్లను తొలగించి రహదారిని నిర్మించారు. రెండు వైపులా వీటిని తొలగించారు. ఇటీవల కురిసిన వర్షాలతో బండరాళ్లు జారి పడుతున్నాయి. ఈ మార్గం నిత్యం వాహన రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఆదివారం రాత్రి కురిసిన వర్షంతో బండరాళ్లు జారి పడ్డాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం జరగలేదు. అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు అడ్డుకట్ట వేయాలని వాహనదారులు కోరుతున్నారు.

– డుంబ్రిగుడ, న్యూస్‌టుడే

గంజాయితో భవిష్యత్తు నాశనం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అమిత్ బర్దార్, చిత్రంలో అదనపు ఎస్పీ ధీరజ్, సెబ్ సీఐ అప్పలనాయుడు

పాడేరు, న్యూస్‌టుడే: యువత గంజాయి జోలికి వెళ్లి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎస్పీ అమిత్ బర్దార్ అన్నారు. సోమవారం మధ్యాహ్నం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో గంజాయి సమూలంగా నిర్మూలనకు డ్రోన్ల ద్వారా ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. డాగ్ స్క్వాడ్‌తో వాహనాల తనిఖీలు చేపడుతున్నామని చెప్పారు. గ్రామాలు, విద్యాలయాల్లో విస్తృతంగా అవగాహన సమావేశాలు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. గిరిజనులు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని కోరారు. అదనపు ఎస్పీ ధీరజ్, సెబ్ సీఐ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

42.55 లక్షల సరకు స్వాధీనం



నిందితులతో ఎస్సై, సిబ్బంది


కొయ్యూరు, న్యూస్‌టుడే: కాకరపాడు ఐటీడీఏ కాలనీలోని చీడిపాలెం వెళ్లే కూడలిలో ఆదివారం 851 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు కొయ్యూరు ఎస్సై రామకృష్ణ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బూదరాళ్ల నుంచి ఒక బైక్, రెండు కార్లలో వస్తున్న నిందితులను పోలీసులను గమనించి వాహనాలను వెనక్కి తిప్పి తప్పించుకునేందుకు ప్రయత్నించారు. ఎస్సై, సిబ్బంది అక్కడికి చేరుకునేసరికి బైక్‌పై నున్న ఇద్దరు, కారులోని ముగ్గురు, మరో కారులోని ఇద్దరు పరారయ్యారు. ఇద్దరు కారు డ్రైవర్లను పట్టుకొని విచారించారు. వారు గంజాయి తరలిస్తున్నట్లు ఒప్పుకొన్నారు. రెండు కార్లలోని రూ.42.55 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. వారిద్దరిని అరెస్టు చేసి వాహనాలు, ఒక సెల్‌ఫోన్‌ని స్వాధీనం చేసుకున్నామన్నారు. మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

మధురం.. మన్యం కాఫీ

నేడు అంతర్జాతీయ కాఫీ దినోత్సవం

చింతపల్లి, న్యూస్‌టుడే

మన్యం పేరు చెప్పగానే కమ్మని కాఫీ గుర్తొస్తుంది. పోడు వ్యవసాయాన్ని, గిరిజనులతో మాన్పించి వారి ఆదాయం కోసమని మన్యానికి అతిథి పంటగా వచ్చిన దీని ఖ్యాతి నేడు జిల్లాలు, రాష్ట్రాలు, దేశ సరిహద్దులు దాటి ఖండాంతరాలకు పాకింది. మంగళవారం అంతర్జాతీయ కాఫీ దినోత్సవం సందర్భంగా న్యూస్‌టుడే ప్రత్యేక కథనం.





ఒకప్పుడు జీవనాధారం కోసం గిరిజనులు అడవులను నరికి పోడు వ్యవసాయం చేసేవారు. ఈ కారణంగా అడవుల విస్తీర్ణం తగ్గిపోయి ఆ ప్రభావం పర్యావరణంపై పడుతుందన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం మన్యంలో కాఫీ సాగుకు శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రభుత్వం, ఐటీడీఏలు గిరిజనులను ఈ సాగు చేపట్టేలా ప్రోత్సహిస్తూ వచ్చాయి. ఈ సాగుకు ప్రధానంగా నీడ అవసరం. నీడ కావాలన్నా, కాఫీ తోటలు పెరగాలన్నా అడవులుండాలి. ఈ సాగు వల్ల అడవుల సంరక్షణతోపాటు, వారితో పోడు వ్యవసాయాన్ని మాన్పించగలిగారు. కాఫీ సాగు వల్ల వచ్చే ఆదాయంతో గిరిజనుల జీవనశైలే పూర్తిగా మారిపోయింది. ఒకప్పుడు కేవలం వందల ఎకరాల్లో పరిమితంగా సాగయ్యే ఈ పంట.. నేడు అల్లూరి జిల్లాలో సుమారు 1.50 లక్షల ఎకరాల్లో పండుతోంది. సుమారు 1.35 లక్షల కుటుంబాలు దీనిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. గిరిజనుల ప్రధాన ఆదాయ వనరు 75 శాతం కాఫీగానే మారింది. గిరిజన రైతులు ఏటా పండించే ఈ గింజల విలువ రూ.150 కోట్లు నుంచి రూ.200 కోట్లగా ఉంది. అల్లూరి జిల్లాలో ఏటా గిరిజన రైతులు సుమారు 10,600 టన్నులకు పైగా పంటను ఉత్పత్తి చేస్తున్నారు.



పండ్లను ఆరబోస్తున్న గిరిమహిళ

బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబే



ఫైన్‌కప్ అవార్డుకు ఎంపికైన అసరాడ గ్రామానికి చెందిన గిరిజన రైతు లకారి వెంకటరావు

అల్లూరి జిల్లాలోని అరకు ప్రాంతంలో గిరిజనులు పండించే కాఫీకి ఇప్పటికే అనేక అంతర్జాతీయ అవార్డులు దక్కాయి. అరకు కాఫీకి తానే బ్రాండ్ అంబాసిడర్‌గా ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ రుచిని దేశ ప్రధాని మోదీ మన్‌కీబాత్‌లో సైతం ప్రస్తావించారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలసి జీ-20 సదస్సులో దీని రుచిచూశారు. వీలైతే మరో కప్పు కాఫీ మీతో కలసి తాగాలని ఉందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ట్వీట్ చేశారు. ఇటీవల ఒలింపిక్స్ నిర్వహించిన పారిస్‌లో 2017లోనే మన్యం కాఫీ అవుట్‌లెట్ ఏర్పాటు చేశారు. మరోదాన్ని త్వరలో తెరవాలనుకుంటున్నట్లు ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహేంద్ర ప్రకటించారు. 2018లో పారిస్‌లో జరిగిన ప్రిక్స్ ఎపిక్యూరస్-2018 పోటీల్లో అరకు కాఫీకి బంగారు పతకం వచ్చింది. ఇటీవల పారిస్‌లో జరిగిన ఒలంపిక్స్ క్రీడా సంబురంలోనూ ఈ రుచులు విదేశీయులకు పరిచయం చేశారు.

తాజాగా చింతపల్లి మండలం లంబసింగి పంచాయతీలోని అసరాడ గ్రామానికి చెందిన గిరిజన రైతు లకారి వెంకటరావు పండించిన కాఫీ జాతీయస్థాయి ఫైన్‌కప్ అవార్డు-2024కు ఎంపికైంది. 2008లో లంబసింగి గ్రామానికి చెందిన గిరిజన మహిళ నర్సి రాములమ్మకు ఇదే అవార్డు దక్కింది.

ఆపద్బాంధవులు

★ రక్తదానంతో ప్రాణాలు నిలుపుతున్న దాతలు
★ నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం



పాడేరు, అనకాపల్లి, న్యూస్‌టుడే

పాడేరులో ఏడుగురు యువకులు 2021లో 'రక్తదానం చేద్దాం.. ప్రాణదాతలు అవుదాం' పేరుతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి అవసరమైనవారికి రక్తం సమకూరుస్తున్నారు. నేటికి మూడు వందలపైగా ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని రక్షించారు.

పాడేరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో 200 యూనిట్లను నిల్వ చేసే సామర్థ్యం గల బ్లడ్ బ్యాంకు ఉన్నప్పటికీ అప్పుడప్పుడు కొరత ఏర్పడుతోంది. పాడేరు జిల్లా ఆసుపత్రిలో క్షతగాత్రులు, గర్భిణులకు రక్తం సకాలంలో అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రతి రోజు కనీసం 10 యూనిట్ల వరకు రక్తం అవసరమవుతుంది. రక్తదానానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కోరుతున్నారు.

అల్లూరి జిల్లాలో 2022లో అప్పటి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 55 శిబిరాలు నిర్వహించి 1360 యూనిట్లు సేకరించి జిల్లా ఆసుపత్రికి అందజేసినట్లు రెడ్‌క్రాస్ సంస్థ సమన్వయకర్త లోహితష్ పేర్కొన్నారు.

పాడేరు ఐటీడీఏ పీఓ వి.అభిషేక్ మూడు నెలలకు ఒకసారి రక్తాదానం చేసి ఆదర్శంగా నిలుస్తున్నారు.

...ఇలా ఎంతోమంది అత్యవసర సమయంలో రక్తదానం చేస్తూ ప్రాణాలు నిలుపుతున్నారు. జిల్లా ఆసుపత్రిలో నెలకు 150 మంది నుంచి 200 మంది వరకు రక్తదానం చేస్తున్నారు. మనం ఇచ్చే రక్తం ఎంతో మంది ప్రాణాలను కాపాడుతుందన్న ప్రచారం ఫలిస్తోంది. అత్యవసర సమయంలో ఎక్కడున్నా రక్తదానం చేస్తూ ప్రాణాలను కాపాడుతున్న దాతలు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.



రెడ్‌క్రాస్ నిర్వహించిన శిబిరంలో రక్తదానం చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, చిత్రంలో ఐటీడీఏ పీఓ అభిషేక్ (పాత చిత్రం)

పెరుగుతున్న అవసరాలు

కరోనా అనంతరం రక్తం అవసరం పెరుగుతోంది. ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలు అధికమయ్యాయి. అలాగే గర్భిణుల్లో రక్తహీనత కేసులు ఎక్కువయ్యాయి. రోడ్డు ప్రమాదాలూ పెచ్చుమీరుతున్న నేపథ్యంలో క్షతగాత్రుల చికిత్సలో రక్తం అవసరం ఎక్కువగా ఉంటోంది. ఇలాంటి అత్యవసర సమయాల్లో రోగులకు రక్తం సమకూర్చడానికి దాతలు సకాలంలో స్పందిస్తూ తమవంతు సహకారాన్ని అందిస్తున్నారు.



రక్తదాతలను అభినందిస్తూ

ఆసుపత్రిలో రక్తదాతల వివరాలు

నెల	రక్తదానం చేసిన వారు
జనవరి	155
ఫిబ్రవరి	143
మార్చి	149
ఏప్రిల్	102
మే	113
జూన్	142
జులై	104
ఆగస్టు	89

ఏ సమయంలోనైనా సిద్ధం



రక్తం అత్యవసరమైతే ఏ సమయంలోనైనా రక్తదానం చేయడం నాకు అలవాటుగా మారింది. మా సోదరి ప్రసవ సమయంలో రక్తం అవసరమైతే లైవ్‌లో రక్తం అందించాను. అప్పటి నుంచి ఎవరికి అత్యవసరమైనా రక్తదానం చేస్తున్నాను. ఇది నాకు ఎంతో తృప్తిని ఇస్తుంది. ఇప్పటికి 20 సార్లు రక్తదానం చేశాను.

– కాండ్రేగుల శ్రీహరి, హరిపాలెం, అచ్యుతాపురం మండలం

స్వచ్ఛంద రక్తదాతలు పెరిగారు



స్వచ్ఛందంగా ఆసుపత్రికి వచ్చి రక్తం ఇచ్చే దాతల సంఖ్య పెరిగింది. దీనివల్ల ఆసుపత్రిలో రోగుల అవసరాలకు తగ్గట్టు రక్తాన్ని అందించగలుగుతున్నాం. పుట్టిన రోజు వేడుకలు, శుభ కార్యక్రమాల సమయంలో రక్తదానానికి యువత ముందుకు వస్తున్నారు. ఏడాదికి రెండు సార్లు రక్తదానం చేసే వారూ ఉన్నారు.

– డాక్టర్ కనకదుర్గ, బ్లడ్‌బ్యాంక్ ఇన్‌ఛార్జి, ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



భానుప్రియను అభినందించిన హెచ్ఎం, టీచర్లు

రంపచోడవరం, న్యూస్‌టుడే: భూసిగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పల్లాల భానుప్రియ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైంది. గత నెల 27న కాకినాడలో జరిగిన అండర్-17 హ్యాండ్‌బాల్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ కనబర్చింది. గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. విద్యార్థిని సోమవారం ప్రధానోపాధ్యాయులు బి.వి.ఎస్ రామారావు, పీడీ ఎం.చినస్వామిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

చింతపల్లి ఇన్‌ఛార్జి డీఎఫ్ఓగా లక్ష్మణ్

చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లి అటవీ డివిజన్ ఇన్‌ఛార్జి డీఎఫ్ఓగా లక్ష్మణ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఇక్కడ పనిచేసిన సీహెచ్ సూర్యనారాయణ ఏలూరు సామాజిక అడవుల విభాగం డీఎఫ్ఓగా బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో గిద్దలూరు డీఎఫ్ఓగా పనిచేస్తున్న వైవీ నరసింహారావును ప్రభుత్వం నియమించింది. ఆయన మరికొద్దిరోజుల్లో బాధ్యతలు చేపట్టనున్నారు. పరిపాలనా సౌలభ్యం కోసం అనకాపల్లి జిల్లా సామాజిక అడవుల విభాగం డీఎఫ్ఓగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మణ్‌కు చింతపల్లి డీఎఫ్ఓగా ఇన్‌ఛార్జి (ఎఫ్ఏసీ) బాధ్యతలు అప్పగించారు. ఆయన సోమవారం సూర్యనారాయణ నుంచి బాధ్యతలు తీసుకున్నారు.

నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారిగా రోహిణి



రోహిణికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

పాడేరు, న్యూస్‌టుడే: నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారిగా డాక్టర్ పి.రోహిణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ పనిచేస్తున్న ప్రశాంత్‌కుమార్ విజయనగరానికి బదిలీపై వెళ్లారు. రోహిణికి కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

తగ్గుతున్న గోదావరి నీటిమట్టం

దేవీపట్నం, న్యూస్‌టుడే: గండిపోశమ్మ అమ్మవారి ఆలయం వద్ద గోదావరి నీటి మట్టం స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. అయితే అమ్మవారి ఆలయం చుట్టూ వరద ప్రవాహం కొనసాగుతోంది. గండిపోశమ్మ అమ్మవారి ఆలయం నుంచి డి.రావిలంక వరకూ ఆర్ అండ్‌బీ రహదారిపై రాకపోకలు సాగుతున్నాయి. సీతపల్లి వాగుకు గోదావరి ఉద్ధృతి కొనసాగుతోంది. వరద మరింత తగ్గితే త్వరలోనే అమ్మవారి దర్శనాలు ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. వరద నేపథ్యంలో పాపికొండల విహారయాత్ర సైతం నిలిచిపోయింది.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

కలెక్టర్ దినేష్‌కుమార్

గిరిజనుల నుంచి వినతుల స్వీకరణ

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఏజెన్సీ ప్రాంతంలో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీతో కలసి సోమవారం ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా గిరిజనులు వివిధ సమస్యలపై 242 వినతులను అందజేశారు. ముందుగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి 516-ఇ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన బాధితులతో సమావేశం ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇటీవల కురిసిన వర్షాలతో పలు రహదారులు దారుణంగా తయారయ్యాయని, వీటికి మరమ్మతులు చేయాలని, శిథిలమైన పాఠశాలలకు పక్కా భవనాలను నిర్మించాలని అఖిల భారత రైతుకూలీ సంఘం డివిజన్ నాయకులు, సర్పంచి సాధల విజయభాస్కరరెడ్డి, బచ్చెల బుచ్చిరెడ్డి, శ్రీదేవి తదితరులు కోరారు.



సమస్యలు వింటున్న కలెక్టర్ దినేష్‌కుమార్

మారేడుమిల్లి మండలం బోదులూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో పనిచేస్తున్న తనకు నాలుగు నెలలుగా జీతాలు చెల్లించలేదని ఉపాధ్యాయుడు పల్లాల బాలురెడ్డి విన్నవించారు.

జలజీవన్ మిషన్‌లో అక్రమాలు

దేవీపట్నం మండలంలో కుటకరాయి గ్రామంలో జలజీవన్ మిషన్ ద్వారా రూ. 16 లక్షలతో చేపట్టిన పనులలో అక్రమాలు చోటు చేసుకొన్నాయని భాజపా జిల్లా కార్యదర్శి కుండ్ల కృష్ణారెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రంపచోడవరం మండలం పందిరిమామిడి నుంచి వై.రామవరం మండలం చవిటిదిబ్బల గ్రామానికి మంజూరు చేసిన బీటీ రోడ్డు పనులు అయిదేళ్లయినా పూర్తి చేయలేదని మడిచర్ల సర్పంచి విజయశాంతి, మాజీ సర్పంచి చిలకల సత్యనారాయణ విన్నవించారు. అటవీ అభ్యంతరాలతో ఏడు కిలోమీటర్ల రోడ్డు పనులు నిలిచిపోయాయని, దీనికి సంబంధించి ఆర్‌అండ్‌బీ అధికారులు అటవీశాఖకు రూ. 90 లక్షలు చెల్లించినా నేటికీ అనుమతులు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎంసీ ప్రత్యేక కలెక్టర్ సరళ, సహాయ ప్రాజెక్ట్ అధికారి రమణ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి జమాల్‌బాషా, జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, జిల్లా వ్యవసాయాధికారి నందు, డీఆర్‌డీఏ, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్లు మురళి, శివయ్య, గిరిజన సంక్షేమశాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీనివాసరావు, పీహెచ్ఓ చిట్టిబాబు, ఉపాధిహామీ ఏపీడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాలకు చక్రాల కుర్చీల వితరణ

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు స్వచ్ఛంద సేవాసంస్థలు తోడ్పాటు అందించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. విశాఖపట్నానికి చెందిన దివీస్ సంస్థ అధినేత సురేష్‌కుమార్ 128 చక్రాల కుర్చీలను వితరణగా అందజేశారు. రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం వద్ద సోమవారం సాయంత్రం ఈ చక్రాల కుర్చీలను కలెక్టర్‌కు అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రంపచోడవరం డివిజన్‌లోని 19 ఆరోగ్య కేంద్రాలతోపాటు ఏరియా ఆసుపత్రికి వీటిని అందజేస్తామన్నారు. ఆసుపత్రులకు నడవలేని స్థితిలో వచ్చే రోగులకు ఇవి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులను కలెక్టర్ అభినందించారు. చక్రాల కుర్చీలను ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ చేతులమీదుగా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి జమాల్‌బాషా, ఏడీఎంహెచ్ఓ శిరీష, ఏపీఓ రమణ, ఎంపీడీవో హరికృష్ణ, తహసీల్దారు కృష్ణజ్యోతి, డీఎల్‌డీఓ కోటేశ్వరరావు, ఏరియా ఆసుపత్రి ఆర్.ఎం. ఇందిర తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.39 కోట్లు

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమం సోమవారం సింహగిరిపై పరకామణి కేంద్రంలో జరిగింది. ఈవో వేండ్ర త్రినాథరావు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది హుండీలు తెరిచి ఆదాయం లెక్కించారు. భక్తులు కానుకల రూపంలో సమర్పించిన నగదు రూ. 1,39,44,045 సమకూరినట్లు ఈవో తెలిపారు. దీంతో పాటు 53.200 గ్రాముల బంగారం, 8.650 కిలోల వెండి లభ్యమైనట్లు వివరించారు. ఈ మొత్తం ఆదాయం 28 రోజులకు సంబంధించినదిగా ఈవో తెలియజేశారు.

కనక మహాలక్ష్మి సన్నిధిలో 3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఈనెల 3 నుంచి 12వ తేదీ వరకు దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ అన్నపూర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిది రోజులపాటు అమ్మవారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిస్తారని చెప్పారు. 3న ఆదిలక్ష్మి-లక్ష కుంకుమార్చన, 4న ధనలక్ష్మి-లక్ష చామంతుల పూజ, 5న ధాన్యలక్ష్మి-లడ్డూల పూజ, 6న ధైర్య లక్ష్మి- తులసీ పూజ, 7న సంతానలక్ష్మి-కలువపూల పూజ, 8న విజయలక్ష్మి-గులాబీల పూజ, 9న విద్యాలక్ష్మి-శ్రీ పుష్పయాగం, 10న గజలక్ష్మి-లక్ష గాజుల పూజ, 11న మహాలక్ష్మి-శాకంబరి పూజ, 12న కనక మహాలక్ష్మి-స్వర్ణాభరణ అలంకరణలో అమ్మవారు దర్శనమివ్వనున్నారు. మూల విరాట్‌కు అలంకరణలు చేస్తున్న నేపథ్యంలో మధ్యాహ్నం పంచామృతాభిషేకం, మంగళ, శుక్ర, శనివారాల్లో నిర్వహించే అష్టదళ పాదపద్మారాధన, క్షీరాభిషేకం, సహస్ర తులసీ దళార్చన, ఇతర సేవలు నిలుపుదల చేస్తామని, అదే విధంగా గర్భాలయ దర్శనాలు ఉండబోవని ఈఓ పేర్కొన్నారు.

రక్తహీనత బారినపడకుండా చర్యలు



గర్భిణుల సీమంతంలో ఐటీడీఏ పీఓ అపూర్వ భరత్

చింతూరు, న్యూస్‌టుడే: రక్తహీనత ఉన్న గర్భిణులు, బాలింతలు, మహిళల పరిస్థితి మెరుగయ్యేలా సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని చింతూరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అపూర్వభరత్ అన్నారు. చింతూరు జూనియర్ కళాశాలలో సోమవారం ఐసీడీఎస్ స్థాయి పోషణ్ మహా కార్యక్రమం సీడీపీఓ పి.విజయగౌరి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి పీఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు రక్తహీనత బారినపడటానికి కారణాలను గుర్తించి, దానిని నివారించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. పోషకాహార లోపంతో ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అనంతరం గర్భిణుల సీమంతంలో పాల్గొని వారిని ఆశీర్వదించారు. పోషకాహార స్టాల్‌ను సందర్శించి అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన వంటకాలను రుచిచూసి వాటి పోషక విలువలు అడిగి తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో పవన్, రాజు తదితరులు పాల్గొన్నారు.


వాలంటీర్ల సమస్యలు పరిష్కరించాలి

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: కూటమి నేతలు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తమకు గౌరవ వేతనం రూ.10 వేలకు పెంచాలని గ్రామ వాలంటీర్లు కోరారు. సోమవారం పాడేరు పట్టణంలో [illegible] కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు సురేష్‌బాబు, రాంబాబు మాట్లాడుతూ.. వాలంటీర్ [illegible] సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ఎన్నికల సమయంలో రాజీనామా చేసిన వాలంటీర్లను తిరిగి విధుల్లోకి చేర్చుకోవాలని కోరారు. మండల అధ్యక్షులు కూర్మన్‌రాజు, మహేష్, దేవా, పరమేశ్వరరావు, కొండబాబు, జానీ, ప్రసాద్, విశ్వనాథం, శశిధర్ పాల్గొన్నారు.

రైతేరాజు

న్యూస్‌టుడే, అనకాపల్లి

పెరిగిన రంగు బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌లో గత వారం రోజులుగా రంగు బెల్లం ధరలు పెరిగాయి. మధ్య, నాసి రకాల ధరలు తగ్గాయి. రంగులు వంద కేజీలకు రూ.685 పెరగ్గా, నాసి రకాలకు రూ.290, మధ్య రకాలకు రూ.110 తగ్గింది.

రకం	గత వారం	ఈ వారం
రంగులు	4,280	4,965
మధ్య	3,860	3,750
నాసి	3,540	3,250

ముంపులో చెరకు.. యాజమాన్య పద్ధతులు


అనకాపల్లి, న్యూస్‌టుడే: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలు లోతట్టు, ఆవ ప్రాంతాల్లోని చెరకు తోటలు ముంపునకు గురవుతున్నాయి. సరైన యాజమాన్య పద్ధతులు పాటించకపోతే దిగుబడులపై ప్రభావం పడుతుంది. ముంపు బారిన పడిన తోటల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను అనకాపల్లి పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి.ఆదిలక్ష్మి సూచిస్తున్నారు.



- తోట నాటేటపుడు ముందే ఊకు కాలువలు తీసుకోవాలి. ముంపు ప్రాంతాల్లో ఎర్రకట్ల తెగులును తట్టుకునే కో6907, 85ఎ261, కోటి 8201, కో7217, కోఎ 7602, 98ఎ163, 2003వి46, 2000ఎ225, 2003వి255 రకాలను విత్తనంగా ఎంచుకోవాలి. పొలం గట్లను బలోపేతం చేసుకోవాలి.
- ముంపునకు గురైన తోటలకు తెల్లదల్లి సోకే ఆస్కారముంది. నివారణకు క్లోరిపైరిపాస్ లీటరు నీటికి 2.5 మి.లీ. కలిపి ఆకు అడుగు భాగం తడిచేలా 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.
- తోటలో చేరిన నీటిని మోటార్ల ద్వారా బయటకు తోడేయాలి. సిఫార్సు చేసిన నత్రజని 30, 60 రోజుల్లో వేయాలి. నీరు తొలగించాక ఎకరాకు 50 కేజీల యూరియా, 50 కేజీల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను మొక్క వేళ్ల వద్ద తవ్వి మట్టితో కప్పాలి.
- నీరు తొలగించలేని పరిస్థితులు ఉంటే లీటరు నీటిలో 25 గ్రాముల యూరియా, 25 గ్రాముల ఎంపీపీ కలిపిన ద్రావణాన్ని ఆకులు తడిచేలా పిచికారీ చేయాలి.

న్యూస్‌టుడే, చింతపల్లి

ఆహ్లాదం.. ఆరోగ్యం.. ఆదాయం



వలిసెల సాగుతో బహుళ ప్రయోజనాలు

అల్లూరి సీతారామరాజు జిల్లా పేరు చెబితే పచ్చని కొండలు, వాటి నడుమ పసుపు తివాచీ పరిచినట్లుండే వలిసె పూల తోటలే గుర్తుకొస్తాయి. గిరిజన ప్రాంతాల్లో రైతులు పండించే సంప్రదాయ వలిసెల సాగు బహుళ ప్రయోజనకారిగా మారింది. ఆహ్లాదంతోపాటు ఆరోగ్యం, ఆదాయాన్నిచ్చే పంటగా పేరొందింది. వేరుశెనగ తర్వాత గిరిజనులు అత్యధిక విస్తీర్ణంలో సాగు చేసే నూనె గింజల పంట ఇదే.

రాష్ట్ర వ్యాప్తంగా వలిసెల సాగు 46,312 ఎకరాల్లో సాగవుతుండగా.. ఒక్క అల్లూరి జిల్లాలోనే సుమారు 20 వేల ఎకరాల్లో వాణిజ్య పంటగా పండిస్తున్నారు. ఏటికేడు సాగు విస్తీర్ణం పెరగాల్సింది పోయి తగ్గుతూ వస్తోంది. ఇందుకు ప్రకృతి వైపరీత్యాలు కొంత కారణం కాగా, నూనె తీసే యంత్రాలు, మిల్లులు మన్యంలో తగినన్ని లేకపోవడం, సరైన మార్కెటింగ్ వ్యవస్థ లేక గిట్టుబాటు ధరలు రాకపోవడంతో సాగు తగ్గుతోందని శాస్త్రవేత్తలు గుర్తించారు.

ప్రత్యేకంగా ప్రాజెక్టు అమలు..: వలిసెల సాగు విస్తీర్ణం పెంచేందుకు శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు చింతపల్లి కేంద్రంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ప్రత్యేకంగా ఓ ప్రాజెక్టును అమలు చేస్తున్నారు. సుమారు మూడు వేల రకాల వలిసెల విత్తనాలపై ఇక్కడ ప్రయోగాలు జరుగుతున్నాయి. హరిపురంలోని బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సాగు అభివృద్ధికి చర్యలు చేపడుతున్నారు. మన్యం వాతావరణానికి అనుకూలమైన రకాలను రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

విత్తే సమయం: ఆగస్టు రెండో పక్షం నుంచి సెప్టెంబరు రెండో పక్షం వరకు విత్తవచ్చు. ఆలస్యమైతే పూత, గింజకట్టు దశలో పైరు వర్షాభావానికి గురై దిగుబడులపై ప్రభావం పడుతుందని బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సేద్యపు విభాగం శాస్త్రవేత్త **డాక్టర్ వానప్రసాదరావు** చెబుతున్నారు.



రకాలు : కేజీఎన్-2, ఉత్కల్‌నైజర్, డీఎన్ఎస్-4, జేఎన్ఎస్-28, జేఎన్ఎస్-30 అనుకూలం.

నేలలు: తేలికపాటి గరుకు నేలలు, కొండవాలు, పోడు నేలలు, తేమ నిల్వ ఉంచుకుని నీరు పోయే అన్ని రకాల నేలల్లో సాగు చేయవచ్చు.

దిగుబడి : ఎకరాకు 160 కేజీల దిగుబడి వస్తుంది. గింజలో నూనె శాతం 45-50 శాతం వస్తుంది. నూనెను వంటల్లోనే కాకుండా సబ్బులు, వార్నీషులు, కాస్మోటిక్స్ తయారీ పరిశ్రమల్లో వినియోగిస్తారు. నూనెను తీయగా మిగిలిన పిండిని పశువుల దాణాగానూ వినియోగించవచ్చు.

బంగారు తీగతో ముప్పు..: ఈ పంటను ఆకాశ పందిరి అనే కలుపు తీగ ఆశించి నష్టపరుస్తోంది. దీన్నే బంగారు తీగ అని పిలుస్తారు. నివారణకు ఉప్పునీటి ద్రావణం పద్ధతిని ఆచరించాలి. ఎకరాకు సరిపడా 2-3 కేజీల వలిసెల విత్తనాలను 20 లీటర్ల నీటిలో 3 కేజీల ఉప్పు వేసి కలియబెట్టాలి. ఈ ద్రావణంలో వలిసెల విత్తనాలను వేసి కలిపితే ఆకాశ పందిరి విత్తనాలు నీటి అడుగుకు చేరతాయి పైకి తేలిన వలిసెల విత్తనాలను వేరు చేసి మంచినీటితో కడిగి ఆరబెట్టి వెంటనే పొలంలో చల్లుకుంటే కలుపు తీగను నివారించవచ్చు.

ఎరువులు: చివరి దుక్కిలో ఎకరాకు 2.5 టన్నుల పశువుల ఎరువు వేయాలి. విత్తిన 15-20 రోజుల వ్యవధిలో నత్రజని వేసుకుంటే దిగుబడులు పెరుగుతాయి. చీడపీడల బెడద చాలా తక్కువ. 100 నుంచి 110 రోజుల్లో పంటకోతకొస్తుంది. మొక్కలను నేలకంటూ కోసి ఎండలో ఆరబెట్టాలి. కట్టెలతో కొట్టి గింజలను వేరుచేయాలి. తర్వాత గింజలను పది రోజుల వరకు ఎండలో ఆరబెట్టి బస్తాల్లో నిల్వచేసి మార్కెట్‌కు తరలించవచ్చు.

రైతు ప్రశ్న? శాస్త్రవేత్త సలహా

మొక్కజొన్నలో తెగుళ్లు.. నివారణ చర్యలు

? రెండు ఎకరాల్లో మొక్కజొన్న వేశా. ఇటీవల కురిసిన వర్షాలకు తోటలో నీరు చేరింది. తెగుళ్లు ఆశించాయి. దిగుబడులపై ప్రభావం పడుతుందా. –కిలో అర్జున్ చౌడుపల్లి

✔: పొలంలో అదనంగా ఉన్న నీటిని పూర్తిగా తొలగించాలి. తేమ లేకుండా అంతర సాగు చేయాలి. మొక్క మొదళ్ల చుట్టూ మట్టిని ఎగదోయాలి. తెగులు ఆశించిన మొక్కలను తొలగించాలి. కత్తెర పురుగు ఆశిస్తే నివారణకు ఎమామెక్టిన్ బెంజోయేట్ మందును లీటరు నీటిలో కలిపి తెగులు ఆశించిన మొక్క మొవ్వ భాగం తడిచేలా పిచికారీ చేయాలి.

? నాలుగు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా. ప్రస్తుతం శాఖీయ దశలో ఉంది. పంట కొనలు రంగుమారుతున్నాయి. – రామారావు, గొందిపాకలు

✔: వర్షాలు తగ్గాక వాతావరణంలో మార్పుల వల్ల ప్రస్తుతం వరి పంటను కాండం తొలుచుపురుగు, గొంగళి పురుగులు, అగ్గితెగులు ఆశించే ఆస్కారముంది. అధిక తేమ వల్ల కొన్ని రకాల తెగుళ్లు సోకవచ్చు. శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులను సంప్రదించి వారి సూచనలు పాటించాలి.



రైతుల ప్రశ్నలు, సందేహాలకు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి సమాధానాలు ఇచ్చారు. – న్యూస్‌టుడే, చింతపల్లి

సాగులో సందేహాలా ఫోను చేయండి

అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త దాడి ఉమామహేశ్వరరావు సమాధానాలు ఇస్తారు. మంగళవారం ఉ: 9 నుంచి - సాయంత్రం 5 గంటల మధ్య 94410 75852 నంబరుకు ఫోన్ చేయవచ్చు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని సెంటర్ ఫర్ పీపుల్స్ ఫారెస్ట్రీ సంస్థ ప్రోగ్రాం అధికారిణి నాగమణి అన్నారు. గుంటగన్నెల పంచాయతీ కేంద్రంలో ఆదివాసీ జీవనోపాధి, సుస్థిర వ్యవసాయ పద్ధతులపై గిరిజన రైతులకు శిక్షణ అందించారు. కూరగాయలు, పప్పుదినుసులు, చిరుధాన్యాలు పండించాలని సూచించారు. సంస్థ సమన్వయకర్త గాసినాయుడు, ప్రతినిధులు రమణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎంసీఆర్పీ

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: ప్రకృతి విధానంలో సాగు చేయడం ద్వారా భూమి సారవంతంగా ఉంటుందని ప్రకృతి సాగు ఎంసీఆర్పీ కె.అప్పలరాజు అన్నారు. వాతంగిలో తూటికాడ కషాయం, ద్రవ జీవామృతం తయారీపై అవగాహన కల్పించారు. తూటికాడ కషాయం వాడటంతో వరి పొలాల్లో దోమ నివారించవచ్చన్నారు. ఐసీఆర్పీలు లోవరెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్పొరేట్ విద్య

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్పొరేట్ స్థాయి నర్సరీ విద్య అందించనున్నట్లు సీడీపీవో రమణి తెలిపారు. సోమవారం స్థానిక రామాలయం వీధిలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద 'సక్షం' కార్యక్రమాన్ని సర్పంచి పుష్పలత ప్రారంభించారు. సీడీపీవో మాట్లాడుతూ.. ప్రాజెక్టు పరిధిలో తొలి విడతగా 19 కేంద్రాలు మంజూరు అయ్యాయన్నారు. ఈ కేంద్రాలకు ప్రభుత్వం టెలివిజన్, ఆర్వోప్లాంట్, ఇతర ప్రత్యేక సామగ్రి పంపిణీ చేసిందని పేర్కొన్నారు. ఏసీడీపీవో రామలక్ష్మి, సూపర్‌వైజర్లు విజయకుమారి, గౌహర్ ఉన్నీసా, సత్యవతి, గౌరి, అప్పలనర్సమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు దారలక్ష్మి పాల్గొన్నారు.



టెలివిజన్‌లో సక్షం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచి పుష్పలత, సీడీపీవో రమణి

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీటీసీ సభ్యురాలు గీత అన్నారు. డుంబ్రిగుడలోని అంగన్‌వాడీ కేంద్రంలో సక్షం కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. మండల వ్యాప్తంగా 12 చోట్ల వీటిని ప్రారంభించినట్లు సీడీపీవో నీలిమ తెలిపారు. సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మోతుగూడెం, న్యూస్‌టుడే: సీలేరు విద్యుత్తు కాంప్లెక్స్‌లోని గుత్తేదారు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు కోరారు. సోమవారం ముఖ్య ఇంజినీర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి వినతిపత్రం అందజేశారు. గుత్తేదారు కార్మికులను పర్మినెంట్ చేయాలని, 2022 ఫిబ్రవరి వేతన సవరణ ప్రకారం అరియర్స్ ఇవ్వాలని, కార్మికులందరికీ ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని, ఏపీ జెన్‌కో ఆసుపత్రిలో వైద్య సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రత్నాకర్, చింతా రాంబాబు, బీవీ రమణ, సుభాని, కార్మికులు పాల్గొన్నారు.



ముఖ్య ఇంజినీర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ఏఎస్సై సేవలు అభినందనీయం

గంగవరం, న్యూస్‌టుడే: పోలీస్‌శాఖలో 37 సంవత్సరాలపాటు పనిచేసి ఎంతోమందికి ఆదర్శంగా నిలిచిన ఏఎస్సై భుజంగరావు సేవలు అభినందనీయమని రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అన్నారు. భుజంగరావు ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా సోమవారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై డి.భూషణం ఆధ్వర్యంలో తోటి సిబ్బంది ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా ఏఎస్పీతోపాటు అడ్డతీగల సీఐ నర్సింహమూర్తి హాజరయ్యారు. అడ్డతీగల, వై.రామవరం ఎస్సైలు బి.రామకృష్ణ, వినోద్, రజాక్, సిబ్బంది కనిగిరి శ్రీను, సాయి, పెద్ద, రత్నకుమారి, వీరబాబు పాల్గొన్నారు.



భుజంగరావు దంపతులను సన్మానిస్తున్న ఏఎస్పీ, సీఐ, ఎస్సైలు, సిబ్బంది

ఆటో, వ్యాను ఢీ... దంపతులకు గాయాలు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి మండలం సున్నంపాడు పంచాయతీ పరిధిలోని దేవరపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. చింతూరు మండలం చట్టి గ్రామానికి చెందిన భార్యాభర్తలు తమ ముగ్గురు పిల్లలతో ఆటోలో రాజమహేంద్రవరం వెళ్లి సోమవారం రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. దేవరపల్లి వద్ద చింతూరు నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్న వ్యాను పశువులను తప్పించే క్రమంలో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న బాబితోపాటు ఆయన భార్య దుర్గకు గాయాలయ్యాయి. ఆటోలో ఉన్న వారి ముగ్గురు పిల్లలు ఎటువంటి గాయాలు కాకుండా సురక్షితంగా బయటపడ్డారు. గాయపడిన దంపతులను 108 అంబులెన్సులో రంపచోడవరం ఆసుపత్రికి తరలించారు.



అంబులెన్సులో గాయాలైన మహిళ తరలింపు

జ్ఞానసంపద పెంపునకు హోమం

మోతుగూడెం, న్యూస్‌టుడే: మోతుగూడెం ఏపీ జెన్‌కో డీఏవీ (దయానంద ఆంగ్లో వేదిక్) ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడు మల్లెల రఘురాం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ఆర్యసమాజ హోమం నిర్వహించారు. విద్యార్థులకు మంచి బుద్ధి, జ్ఞానం సిద్ధించాలని ఈ హోమం నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులు మంచి ఫలితాలతో ఉత్తీర్ణత పొంది, భవిష్యత్తులో ఉన్నత స్థానంలో నిలవాలని ప్రార్థించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

హోంగార్డులపై వీధి విక్రయదారుల దాడి

విశాఖపట్నం, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డులో ఆదివారం అర్ధరాత్రి కొంతమంది వీధి విక్రయదారులు హోంగార్డులపై దాడిచేసి గాయపరిచారు. దీనికి సంబంధించి మూడో పట్టణ పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. అల్లూరి జిల్లాకు చెందిన షేక్ రహీమ్, నగరానికి చెందిన హోంగార్డులు అనిల్, నూకరాజు ఆదివారం రాత్రి బీచ్‌రోడ్డులో సరదాగా గడిపేందుకు వచ్చారు. అక్కడ ఐస్‌క్రీమ్ విక్రయదారుడితో డబ్బుల విషయంలో గొడవ జరిగింది. మేం పోలీసులమని, మమ్మల్నే డబ్బులు అడుగుతావా అంటూ ఈ ముగ్గురు ఐస్‌క్రీం విక్రయదారుడిని నిలదీశారు. ఈ విషయమై ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. సమీపంలోని వీధి వ్యాపారులు అందరూ అక్కడకు చేరారు. వీరి మధ్య వాగ్వాదం పెరగడంతో ఈ ముగ్గురిపై విక్రయదారులు దాడిచేశారు. దీంతో హోంగార్డులకు గాయాలయ్యాయి.

పోలీసుల కళ్లుగప్పి గంజాయి నిందితుడి పరారీ

విశాఖపట్నం, న్యూస్‌టుడే: పోలీసులు కళ్లుగప్పి గంజాయి నిందితుడు పరారైన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. అజ్ఞాత వ్యక్తుల సమాచారంతో నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఈనెల 28న దువ్వాడ రైల్వే స్టేషన్‌వద్ద నిఘా వేసి అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలుకు చెందిన అరడ శివకుమార్ (23) మరో బాలుడ్ని అదుపులోకి తీసుకొని 21 కేజీల గంజాయి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని దువ్వాడ శాంతి భద్రతల పోలీసులకు అప్పగించారు. ఆదే రోజు అర్ధరాత్రి సమయంలో స్టేషన్‌లో ఉన్న శివకుమార్ రాత్రి విధుల్లో ఉన్న పోలీసులు కళ్లుగప్పి పరారయ్యాడు. అప్పటినుంచి పోలీసులు ఈ సంఘటనను గోప్యంగా ఉంచి మూడు బృందాలతో గాలిస్తున్నా నేటికీ ఆచూకీ తెలియరాలేదు. రాత్రి విధుల్లో ఉన్న పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే బేడీలు తొలగించి పరారయ్యాడన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనపై నగర కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. బాలుడ్ని జువైనల్ హోమ్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గోరాపూర్-దార్లిపుట్ డబ్లింగ్‌కు అనుమతులు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: తూర్పు కోస్తా రైల్వే వాల్తేర్ డివిజన్‌లోని గోరాపుట్-దార్లిపుట్ సెక్షన్‌లో జరుగుతున్న డబ్లింగ్ పనుల్లో 12.649 కిలో మీటర్లుకు సీఆర్ఎస్ అనుమతి లభించిందని వాల్తేర్ సీనియర్ డీసీఎం కె. సందీప్ తెలిపారు. సౌత్ ఈస్టర్న్ సర్కిల్ రైల్వే సేఫ్టీ కమిషనర్ బ్రిజేష్ కుమార్ మిశ్రా సెక్షన్‌లో తనిఖీలు నిర్వహించి ఈ అనుమతులు ఇచ్చారన్నారు. కొత్తవలస-కిరండూల్ లైన్‌లోని ఈ ప్రాంతంలో డబ్లింగ్ పనులు పూర్తి చేయడానికి వాల్తేర్ రైల్వే వ్యూహాత్మకంగా వ్యవహరించిందన్నారు. పూర్తయిన డబ్లింగ్ పనుల్లో 2 కి.మీ. ఏపీలో ఉండగా మిగిలిన భాగమంతా ఒడిశా పరిధిలో ఉన్నట్లు తెలిపారు. వాల్తేర్ డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

అస్తవ్యస్త నిర్మాణ పనులపై ఆందోళన

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: రాజవొమ్మంగిలో జరుగుతున్న 516-ఇ జాతీయ రహదారి నిర్మాణ పనులపై గ్రామస్థులు సోమవారం రాత్రి ఆందోళన చేపట్టారు. రోజూ వందలాది వాహనాలు తిరిగే నాలుగు రోడ్ల కూడలి వద్ద రహదారి విశాలంగా నిర్మించడం లేదంటూ. వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. సీఐ సన్యాసినాయుడు సమస్యపై గుత్తేదారు సంస్థతో మాట్లాడతానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. హైవే నిర్మాణ పనుల్లో లోపాలను ఎమ్మెల్యే శిరీషాదేవి దృష్టికి తీసుకెళ్లినట్లు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు త్రిమూర్తులు తెలిపారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. వంద మీటర్ల పరుగులో పి.పవన్‌కుమార్ ప్రథమ, లాంగ్‌జంప్‌లో టి.గోపాలకృష్ణ ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అర్హత సాధించినట్లు ప్రిన్సిపల్ భరత్‌కుమార్‌నాయక్ తెలిపారు. 4, 5, 6 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థులను సోమవారం ప్రిన్సిపల్ నాయక్, స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి నాగబాబు, పీడీ అప్పారావు అభినందించారు.



ప్రతిభ చూపిన విద్యార్థులు పవన్, గోపాల్‌తో ప్రిన్సిపల్, అధ్యాపకులు

వేతనాలు పెంచక కార్మికుల ఇబ్బందులు

పాడేరు, న్యూస్‌టుడే: ఏళ్ల తరబడిగా పని చేస్తున్న ఒప్పంద, పొరుగు సేవలు, రోజువారీ కార్మికులందర్నీ క్రమబద్ధీకరించాలని కోరుతూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పాడేరులో కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు చిన్నయ్యపడాల్, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ కార్మికులంతా తక్కువ జీతంతో పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని ఐటీడీఏ, గిరిజన సంక్షేమశాఖ, గురుకులాలు, కాఫీ, వైద్యారోగ్యశాఖ, సమగ్ర శిక్షా, విద్యుత్తు, ఆర్టీసీ, ఉపాధి హామీ, రైల్వే, ఏపీ టూరిజం, జీసీసీ, ఆసుపత్రుల్లో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. వీరికి వేతనాలు పెంచకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరారు. అనంతరం జిల్లా సంయుక్త కలెక్టర్ ఎంజె అభిషేక్ గౌడకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు సుందరరావు, వైద్యారోగ్య శాఖ ఉద్యోగుల సంఘం నాయకులు లక్ష్మణ్‌రావు, ఐటీడీఏ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బాలన్న తదితరులు పాల్గొన్నారు.



ఐటీడీఏ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఒప్పంద, పొరుగుసేవల కార్మికులు

అన్నిరంగాల్లో మహిళల రాణింపు

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: నేటి సమాజంలో మహిళలు అన్నిరంగాల్లో దూసుకుపోతున్నారని ఎస్సై సంతోశ్‌కుమార్ తెలిపారు. రేఖపల్లి కస్తూర్బా బాలికా విద్యాలయంలో సోమవారం విద్యార్థినులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆడపిల్లలమని వెనకడుగు వేయొద్దని, ఉన్నత లక్ష్యాలను పెట్టుకుని, ఆ దిశగా రాణించాలని సూచించారు. మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. తొలుత ఎస్సై మండల కేంద్రంలోని వారపు సంతను పరిశీలించారు. రహదారులపైన ఆటోలు, ద్విచక్రవాహనాలు అడ్డుగా పెట్టకుండా చూశారు. ఇటీవల బాధ్యతలు తీసుకున్న ఎస్సైను జడ్పీటీసీ సభ్యుడు వాళ్ల రంగారెడ్డి, సీపీఎం నాయకులు పూనెం సత్యనారాయణ కలిసి మాట్లాడారు. అనంతరం శాలువాతో సత్కరించారు. ముత్యాల రామారావు, బొర్రా నరేశ్, చంద్రశేఖర్, నరసింహరావు, రాజు, మల్లికార్జున్, చిన్నబాబు, సంతోశ్, పంకు సత్తిబాబు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్సై సంతోష్‌కుమార్

మినీ డిపోల ఏర్పాటు

పాడేరు, న్యూస్‌టుడే: కొయ్యూరు మండలం మంప పంచాయతీ ఆర్.దొడ్డవరం, పోతపల్లి, గంగవరం, గుడుగుల బండ గ్రామాల్లోనే నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశించారు. జిల్లా పౌరసరఫరాల అధికారులు ఆయా గ్రామాల్లో మినీ డిపోలు ఏర్పాటు చేసి అక్టోబర్ ఒకటి నుంచి అక్కడే సరకులు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	102	95
లైవ్	124	115
డ్రెస్‌డ్	180	200
స్కిన్‌లెస్	205	210

డిప్యుటేషన్‌పై ఉపాధ్యాయుల నియామకం

స్పందనకు వందనం

మోతుగూడెం, న్యూస్‌టుడే: మోతుగూడెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు డిప్యుటేషన్‌పై ఉపాధ్యాయులు నియమితులయ్యారు. ఇక్కడి సాంఘిక, భౌతికశాస్త్రాల స్కూల్ అసిస్టెంట్లు ప్రసూతి సెలవులపై వెళ్లారు. ఆంగ్లం బోధించే ఉపాధ్యాయుడు రాజవొమ్మంగి ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. పాఠశాలలు పునః ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు ఆంగ్లం, సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాల బోధన ఇంకా ప్రారంభం కాలేదు. దీంతో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆగస్టు 7న 'ఉపాధ్యాయులు లేరు.. పరీక్షలు రాయడం ఎలా?' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు చింతూరు ఉన్నత పాఠశాల నుంచి కె.భద్రయ్య, ప్రసాద్‌ను... రాజవొమ్మంగి నుంచి శాంతిబాబులను డిప్యుటేషన్‌పై ఇక్కడకు పంపారు. వీరు ప్రతి గురు, శుక్ర, శనివారాల్లో మోతుగూడెం పాఠశాలలో విధులు నిర్వహిస్తారు.

యువతకు ఉపాధి కల్పనకు కృషి

రంపచోడవరం, న్యూస్‌టుడే: మన్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా ఉపాధి అధికారి సంగీత పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, ఐటీడీఏ సంయుక్తంగా జాబ్‌మేళా నిర్వహించారు. ఐదు కంపెనీలు ఇందులో పాల్గొన్నాయి. 182 మంది ఇంటర్వ్యూకు హాజరు కాగా.. 62 మందికి ఉద్యోగాలను కల్పించారు. సంగీత మాట్లాడుతూ.. జాబ్‌మేళాలను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చిట్టిబాబు, వైస్ ప్రిన్సిపల్ రవికుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన వారితో అధ్యాపకులు

అంచుల్లో అపాయం

ప్రమాదకరంగా పాడేరు ఘాటీ

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే

నిన్నమొన్నటి వరకూ విశాలంగా ఉన్న పాడేరు ఘాట్‌రోడ్డు ప్రస్తుతం సింగిల్ రోడ్డు మాదిరిగా మారిపోయింది. కేబుల్ వైర్లు అమర్చే పనుల నిమిత్తం రోడ్డుకు ఇరువైపులా అంచులు తవ్వేశారు. వైర్లు అమర్చాక నిర్వాహకులు మట్టి పూడ్చే పని సక్రమంగా చేయలేదు. సరైన పటుత్వం లేక అంచులు ప్రమాదకరంగా మారాయి. వర్షాలు భారీగా పడుతుండడంతో రోడ్డు ఛిద్రంగా మారింది. ప్రతి రోజూ ఒక ట్రెండు వాహనాలు మట్టిలో కూరుకుపోతున్నాయి. ఈ మార్గంలో వాహన రద్దీ ఎక్కువగా ఉంటోంది. ఎదురుగా వచ్చే వాహనానికి దారి ఇచ్చే క్రమంలో పొరపాటున రోడ్డు అంచు దిగితే టైర్లు కూరుకుపోతున్నాయి. ఆర్టీసీ బస్సులు సైతం ఈ మార్గంలో తిప్పేందుకు డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో నని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధింత అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా అంచులను కంకరతో నింపి, ప్రమాదాలకు తావు లేకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.



పాడేరు ఘాటీలో ట్రాఫిక్ ఇబ్బందులు



కేబుల్ వైర్లు అమర్చేందుకు తవ్వేసిన రోడ్డు అంచులు

సూచికలు ఎక్కడ?

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: నిత్యం పర్యటకులు, వాహనదారులతో రద్దీగా ఉండే అరకు ఘాట్‌రోడ్డులో సూచిక బోర్డులు తుప్పల మాటున ఉండిపోయాయి. ఇవి కనిపించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు భారీగా పెరగడంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. మలుపుల్లో ఎదురుగా వాహనాలు వచ్చే క్రమంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు స్పందించి తుప్పలను తీయించాలని, సూచిక బోర్డులు కనిపించేలా ఏర్పాట్లు చేయాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.



వెంకయ్యపాలెం వద్ద తుప్పల్లో ఉన్న బోర్డు

ఎస్సైల బాధ్యతల స్వీకరణ



కొయ్యూరు, న్యూస్‌టుడే: కొయ్యూరు నూతన ఎస్సైగా కె.వి.నాగార్జున సోమవారం బాధ్యతలు చేపట్టారు. దేవీపట్నం నుంచి బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన రామకృష్ణ స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు.



అరకులోయ, న్యూస్‌టుడే: అరకులోయ ఎస్సైగా గోపాలరావు బాధ్యతలు స్వీకరించారు. ఈయన మోతుగూడెంలో పనిచేస్తూ ఇక్కడకు బదిలీ అయ్యారు. ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

రేపటి నుంచి గ్రామసభలు

వై.రామవరం, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పనుల గుర్తింపునకు ఈనెల 2 నుంచి నవంబరు 7 వరకు గ్రామసభలు నిర్వహిస్తామని ఎంపీడీఓ బాపన్నదొర సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి ఉపాధి పనుల గుర్తింపు, కూలీల బడ్జెట్ తయారు చేస్తామన్నారు. సభల్లో ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదుకు శ్రీకారం

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో అర్హులైన ఉపాధ్యాయులు ఓటు హక్కు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ హరేంధిరప్రసాద్ సూచించారు. కలెక్టరేట్‌లో రాజకీయ పక్షాల ప్రతినిధులతో సోమవారం సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ పదవీకాలం వచ్చే ఏడాది మార్చి 29తో ముగుస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఉపాధ్యాయులు ఓటరు జాబితా తయారీ ప్రక్రియకు శ్రీకారం చుట్టిందన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాలు దీని పరిధిలోకి వస్తాయని చెప్పారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు సెకండరీ స్థాయి (ఆరో తరగతికి పైబడిన) పాఠశాలల్లో రెగ్యులర్ లేదా అడ్‌హాక్ ప్రాతిపదికన పనిచేసే ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఓటు నమోదుకు అర్హులన్నారు. పార్ట్‌టైమ్ పద్ధతిలో పనిచేసే వారు అర్హులు కాదన్నారు. ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు స్వీయ ధ్రువీకరణ పత్రం, సంబంధిత హెచ్‌ఎంలు ఇచ్చే ధ్రువపత్రంతో పాటు డీఈఓ కౌంటర్ సైన్ చేసిన పత్రాలను సమర్పించాలన్నారు.

అవీ ఇవీ

పీహెచ్‌సీకి వితరణ

గూడెంకొత్తవీధి: జెర్రెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు లోచలి రామకృష్ణ, మద్ది వెంకటరమణ ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రికి పరుపులు అందించారు. జనసేన జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారాం, మండల అధ్యక్షుడు బాలరాజు, వైకాపా నాయకులు విష్ణుమూర్తి, సర్పంచి నాగరాజు, ఎంపీటీసీ సభ్యుడు లోవరాజు పాల్గొన్నారు.

6357 మందికి పింఛన్లు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: రాజవొమ్మంగి మండలంలో 6,357 మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీవో యాదగిరీశ్వరరావు సోమవారం తెలిపారు. పింఛన్ల నిమిత్తం రూ 2.61 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు.

3 నుంచి దసరా ఉత్సవాలు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లి రంగా సెంటర్ వద్ద దుర్గాదేవి నవరాత్రుల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య తెలిపారు. స్థానిక ముత్యాలమ్మ ఆలయం వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు సోమవారం సమావేశమయ్యారు. ఈనెల 3న దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తామన్నారు. కమిటీ సభ్యులు సత్తిబాబు, తాటిపాకల రమేష్, రమణ, చిన్న, శ్రీను పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: అరుకు పంచాయతీ కేంద్రంలో రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే మత్స్యలింగం సోమవారం శంకుస్థాపన చేశారు. రూ. 20 లక్షల జిల్లా పరిషత్తు నిధులతో ఈ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు. ఎంపీపీ ఈశ్వరి, జడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, ఉప ఎంపీపీ లలిత, సర్పంచి శారద, ఎంపీటీసీ సభ్యురాలు వరహాలమ్మ, నాయకులు కృష్ణారావు, అశోక్, నర్సింగరావు, రామ్మూర్తి, పీఆర్ ఏఈఈ అజయ్ తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపనలో ఎమ్మెల్యే తదితరులు

పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత



ఒనకడిల్లీలో బీఎస్ఎఫ్ జవాన్ల స్వచ్ఛభారత్

పాడేరు, న్యూస్‌టుడే: పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో భాగంగా చివరి రోజైన మంగళవారం అన్ని కార్యాలయాలు, విద్యా సంస్థలు, వసతిగృహాలు, బస్ డిపోలు, ప్రధాన, జాతీయ రహదారులు, ఖాళీ స్థలాలు, తాగునీటి వనరులు, పర్యాటక ప్రదేశాలను శ్రమదానంతో బాగు చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు వారి గదులను బాగు చేసుకోవాలన్నారు.

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లి పంచాయతీలో కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతే సేవ కార్యక్రమం నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికులకు ప్రధానమంత్రి సురక్ష బీమా పథకం నమోదు చేయించారు. దుప్పిరి ప్రభాకర్ రావు, శివ, లోవరాజు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒనకడిల్లీలో బీఎస్ఎఫ్ జవాన్లు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో డాగ్‌షో నిర్వహించారు. మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలపై నాటిక ద్వారా వివరించారు. జవాన్లు, విద్యార్థులు సంప్రదాయ నృత్యాలు చేశారు. బీఎస్ఎఫ్ ఒనకడిల్లీ కంపెనీ అసిస్టెంట్ కమాండెంట్ రాజేశ్‌కుమార్, ప్రధానోపాధ్యాయురాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరులపై మంచు సిరులు

ప్రకృతి అందాలకు చిరునామా గిరిజన ప్రాంతం. ముంచంగిపుట్టులో సోమవారం వర్షం తగ్గాక మంచు తెరలు కమ్ముకుని అందమైన దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. భూమిపై ఆకుపచ్చని తివాచీ పరిచినట్లున్న పంట పొలాలకు ఆనుకుని ఉన్న కొండలపై కారుమబ్బులు కమ్ముకుని మంచు తెరలు దర్శనమిచ్చాయి. – ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే



నిండుగా నీరున్నా నిరుపయోగం



నిండుగా కొర్రాయి మినీ రిజర్వాయర్

డుంబ్రిగుడ మండలం కొర్రాయి మినీ రిజర్వాయర్‌లో నిండుగా నీరున్నా పొలాలకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. గత తెదేపా ప్రభుత్వ హయాంలో రూ.లక్షల నిధులతో దీన్ని నిర్మించారు. వైకాపా ప్రభుత్వం అయిదేళ్లుగా దీనిపై నిర్లక్ష్యం వహించడంతో సాగునీరు కరవైంది. కాలువలు కొట్టుకుపోయాయి. స్పిల్‌వే గేటు కూరుకుపోయింది. గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో చెరువులు, రిజర్వాయర్లు అలంకారప్రాయంగా మిగిలాయని గిరి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రిజర్వాయర్ ద్వారా సుమారు 120 ఎకరాలకు నీరందాల్సి ఉన్నప్పటికీ స్పిల్‌వే గేటు మరమ్మతు, కాలువల దుస్థితితో సాగునీరు సక్రమంగా అందడం లేదు. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలని గిరిరైతులు కోరుతున్నారు. – డుంబ్రిగుడ, న్యూస్‌టుడే

క్విజ్ పోటీల్లో రాజవొమ్మంగి విద్యార్థుల ప్రతిభ



విజేతలతో ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర-2047పై జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీల్లో రాజవొమ్మంగి అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు మండల విద్యా శాఖాధికారులు కె.వి.వి.సత్యనారాయణ దొర, టి.సూరయ్యరెడ్డి తెలిపారు. పాఠశాలలో సోమవారం ప్రధానోపాధ్యాయుడు డి.వి.గోపాలకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు అభినందన సభ జరిగింది. క్విజ్‌లో ప్రథమ స్థానం సాధించిన గుణశేఖర్, ప్రశాంత్, తనుశ్రీ... వ్యాసరచనలో తృతీయ స్థానం సాధించిన కాంచనలను, తర్ఫీదునిచ్చిన ఉపాధ్యాయులను వక్తలు అభినందించారు.

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర-2047పై అరకులోయ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. రాష్ట్ర అభివృద్ధిలో యువతను భాగస్వామ్యం చేయడం ఈ కార్యక్రమ ఉద్దేశమని ప్రిన్సిపల్ చలపతిరావు తెలిపారు. అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనాలకు రికార్డులు తప్పనిసరి

జి.మాడుగుల, న్యూస్‌టుడే: వాహనదారులు తప్పనిసరిగా రికార్డులు కలిగి ఉండాలని ఎస్సై షణ్ముఖరావు పేర్కొన్నారు. జి.మాడుగుల మండల కేంద్రంలో సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. వాహన రికార్డులతోపాటు లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. అనుమానితులను ప్రశ్నించి విడిచిపెట్టారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



జి.మాడుగులలో వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్సై షణ్ముఖరావు

గిరి విద్యార్థులకు ఉచిత శిక్షణ

రంపచోడవరం, న్యూస్‌టుడే: పదో తరగతి ఉత్తీర్ణత విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్ (వైటీసీ)లో ఏటీడబ్ల్యూవోలు, మండలానికి ముగ్గురు చొప్పున ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు సోమవారం ఏర్పాటైన శిక్షణకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏజెన్సీలో పదో తరగతి పాసైన విద్యార్థులకు ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సులపై అవగాహన కల్పించాలన్నారు. అగ్రికల్చరల్, డిప్లమో, టెక్నికల్ కోర్సులైన ఇంజినీరింగ్, ఫ్యాషన్ టెక్నాలజీ, డిజైనింగ్, ఆర్కిటెక్చర్, పైలట్, సైంటిస్టు, డాక్టర్, న్యూట్రినిస్టు, ఫార్మసిస్టు, పారామెడికల్ కోర్సులు, ఫిజియోథెరపిస్టులు, నర్సింగ్, అగ్రికల్చర్, చార్టర్డ్ అకౌంట్స్, హోటల్ మేనేజ్‌మెంట్, సివిల్ సర్వీసెస్ తదితర కోర్సులపై ఆసక్తి ఉన్న విద్యార్థులను గుర్తించాలన్నారు. ఆయా కోర్సుల్లో విద్యార్థులకు వైటీసీల్లో ఉచిత శిక్షణ ఇవ్వడంతోపాటు భోజనం, వసతి కల్పించడం జరుగుతుందన్నారు. ఐటీడీఏ పీవో సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ, ఏటీడబ్ల్యూవోలు రజని, రామతులసి, క్రాంతికుమార్, రిసోర్సు పర్సన్లు రవీంద్ర, అల్లూరయ్య, హనుమంతరావు, మంజునాబీబీ, మాస్టర్ ట్రైనర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

చట్టాలపై అవగాహన అవసరం



విద్యార్థినులతో మాట్లాడుతున్న గంగవరం ఎస్సై భూషణం తదితరులు

గంగవరం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులతోపాటు విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని గంగవరం ఎస్సై డి.భూషణం విద్యార్థినులకు సూచించారు. స్థానిక ఆశ్రమ బాలికోన్నత పాఠశాల, వసతి గృహాలను సోమవారం ఎస్సై సిబ్బందితో కలిసి సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడారు. వసతిగృహం, వంటశాల, భోజనశాల పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి, సంక్షేమాధికారి లావణ్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి

ఎటపాక, న్యూస్‌టుడే: ఈ ఏడాది జులై, ఆగస్టు నెలల్లో వచ్చిన భారీ వర్షాలతో , గోదావరి వరదలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రతి కుటుంబానికి ప్రభుత్వం రూ. 10 వేల పరిహారం ఇచ్చి ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ఇసంపల్లి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మండలంలోని గుండాల కాలనీలో సీపీఎం గ్రామసభలు సోమవారం ప్రారంభమయ్యాయి. జి.హరినాథ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభా ప్రాంగణం దగ్గర సీనియర్ పార్టీ సభ్యులు తోట వెంకటరమణ పార్టీ జెండా ఆవిష్కరించి అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ గుండాల కార్యదర్శిగా తోట శ్రీనివాసరావును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఐ.పద్మ, పి.బాలకృష్ణ, జి.హుస్సేన్, ఇరపా సత్యం తదితరులు పాల్గొన్నారు.



గుండాల కాలనీలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: వరదల్లో చిక్కుకున్న అన్ని గ్రామాలకు ముంపు పరిహారం, జీవనభృతి పరిహారం అందించాలని ఉప ఎంపీపీ ముత్యాల భవానీ, వడ్డిగూడెం సర్పంచి నర్సమ్మ డిమాండ్ చేశారు. వరరామచంద్రాపురంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. వరరామచంద్రాపురం మొత్తానికి ఈ రెండు రకాల పరిహారం అందలేదన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉంటే గ్రామస్థుల పరిస్థితి తెలిసేదన్నారు. ఈ గ్రామంలో ఎక్కువ మంది వ్యవసాయ కూలీలని, వారికి పనులు లేక కుటుంబ పోషణకు ఇబ్బందిగా ఉందన్నారు.

అరకులో జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నీ

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: సీనియర్ క్రీడాకారుల స్మారక జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నీ ఈనెల 9వ తేదీ నుంచి అరకులోయ వేదికగా నిర్వహించనున్నట్లు ఓల్డ్ స్టూడెంట్స్ స్పోర్ట్స్, కల్చరల్ అసోసియేషన్ సభ్యులు రామారావు, సత్యనారాయణ, శ్రీను తెలిపారు. అక్టోబరు 9, 10, 11 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ టోర్నీకి జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల నుంచి జట్లు పాల్గొనవచ్చన్నారు. వివరాలకు 77804 09662, 90006 02332, 94923 45225 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

పూర్వ విద్యార్థుల క్రీడా, సాంస్కృతిక సంఘ అధ్యక్షులుగా విశ్రాంత పీడీ బి.ఆనంద్‌రావు ఎన్నికయ్యారు. అసోసియేషన్ ఎన్నిక సోమవారం నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా కొర్రా రామారావు, గెమ్మెలి బాబూరావు, వంతల రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా ఎం పౌలు, సంయుక్త కార్యదర్శులుగా కిల్లో అప్పలరాజు, మొస్య జోగారావు, కోశాధికారిగా వై సత్యనారాయణ, మణికంఠ, కన్వీనర్లుగా మొంగునాయుడు, ఆర్ రామారావు, శెట్టి నాగేశ్వరరావును ఎన్నికున్నారు.

నిత్యావసరాల అందజేత

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ఇటీవల అల్పపీడనం ప్రభావంతో నిరాశ్రయులైన గిరిజన కుటుంబాలకు నిత్యావసర సరకులు అందజేశామని ట్రూత్ మినిస్ట్రీస్ సోషల్ ఆర్గనైజేషన్ సంస్థ అధ్యక్షురాలు పాలపర్తి ప్రియాంక, ప్రతినిధి ఐజాక్ తెలిపారు. సోమవారం కొమ్మంగి పంచాయతీ మూలగరువు గ్రామంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాదు బాబు, నాగేశ్వరరావు, అప్పన్న, అప్పారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

దాత సహకారంతో విద్యార్థులకు భోజనం

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: పాత పాడేరు ప్రాథమిక పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఏడీ గిడ్డి అప్పారావు నాయుడు ఆర్థిక సహాయంతో సోమవారం 'శుభ్ దిన్ భోజన్' కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు దాతలు మధ్యాహ్న భోజనం అందించొచ్చని ప్రభుత్వం పేర్కొంది. ఇదే పాఠశాలలో ప్రాథమిక విద్యనభ్యసించి విద్యాశాఖ ఏడీగా పనిచేస్తున్న అప్పరావునాయుడు సోమవారం భోజన ఏర్పాట్లు చేశారు. ఏడీ దంపతులు దగ్గరుండి వంటకాలు చేయించి పిల్లలకు వడ్డించారు. దాతలంతా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు. ఎస్ఎంసీ ఛైర్మన్ కృష్ణ, ఎండీఎం సమన్వయకర్త వెంకటరమణ, డీఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఏడీ అప్పారావునాయుడు దంపతులు

ఉద్యోగులకు సేవలతోనే గుర్తింపు

హుకుంపేట, న్యూస్‌టుడే: కష్టపడి పనిచేసిన ఉద్యోగులకు మంచి గుర్తింపు వస్తుందని సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ పేర్కొన్నారు. తహసీల్దార్ రాజ్యలక్ష్మి పదవీ విరమణ సందర్భంగా సోమవారం ఆమె దంపతులను స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సత్కరించారు. ఇందులో పాల్గొన్న సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. రాజ్యలక్ష్మి సేవలను కొనియాడారు. స్థానిక సీఐ, ఎస్సై, రెవెన్యూ, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: ఉద్యోగులకు సేవలతోనే గుర్తింపు వస్తుందని వక్తలు పేర్కొన్నారు. చిలకలగెడ్డ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీటీగా విధులు నిర్వర్తిస్తున్న దురియా శ్రీనివాసరావు పదవీ విరమణ పొందారు. ఆయన్ను ప్రధానోపాధ్యాయులు సైమన్ ఆధ్వర్యంలో సోమవారం సత్కరించారు. ఎంపీపీ శెట్టి నీలవేణి, మాజీ ఎంపీపీ శెట్టి గంగధరస్వామి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



తహసీల్దార్ దంపతులను సత్కరిస్తున్న సబ్ కలెక్టర్, అధికారులు

మేమున్నాం.. మీకు తోడుగా..

పాడేరు 89853 66570, అరకులోయ 63034 86346, రంపచోడవరం 94908 77172

రంపచోడవరం, న్యూస్‌టుడే

?: రంపచోడవరం నుంచి కొత్త గాంధీ నగరం వెళ్లే రహదారిలో గోతులు పడ్డాయి. రాత్రి వేళల్లో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.

– వరహాలరావు, రంపచోడవరం

✓: ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులు దెబ్బతిన్నాయి. మరమ్మతు చేసేందుకు ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే పనులు చేపడతాం.

– ప్రదీప్, ఆర్అండ్‌బీ ఏఈ

కార్యాలయంలో చదును పనులు

స్పందనకు వందనం

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లిలోని గిరిజన సహకార సంస్థ (జీసీసీ) కార్యాలయ పరిసరాలను ఎట్టకేలకు మట్టితో చదును చేశారు. ఈ సమస్యపై 'ఈనాడు'లో 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన చిత్రవార్త ప్రచురితమైంది. దీనికి సంబంధిత అధికారులు స్పందించారు. సోమవారం లారీలతో మట్టి తరలించి, పొక్లెయిన్‌తో చదును చేయించారు.



సమస్యలు పరిష్కరించాలని వినతి

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: బొడ్లంక, ఆకుమామిడికోట గ్రామాల వద్ద ఉన్న కొండవాగులపై శాశ్వత వంతెనలు నిర్మించాలని, ఆకుమామిడికోట నుంచి గుర్తేడు వరకు అసంపూర్తిగా నిలిచిపోయిన రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయాలని సర్పంచులు సాదల ప్రేమ్‌కుమార్‌రెడ్డి, గొర్లె దుష్యంతుడు, జి.రేవతి కోరారు. సోమవారం రంపచోడవరంలో కలెక్టర్ దినేశ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. లోతట్టు గ్రామాలకు చెందిన గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.

రంపచోడవరం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు ఆర్అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించడంతోపాటు పునరావాసం కల్పించి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, కార్యదర్శి వర్గ సభ్యులు మట్ల వాణిశ్రీ, పల్లపు వెంకట్, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సిరిమల్లిరెడ్డి తదితరులు కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కోరారు. సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

తిరుపతి లడ్డూ కల్తీ అపచారం

రంపచోడవరం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూను కల్తీ చేసి అపరచారానికి పాల్పడిందని మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు విమర్శించారు. సోమవారం ఐ.పోలవరం వెంకటేశ్వరస్వామి ఆలయంలో జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కుండ్ల రాజశేఖర రెడ్డి, మండల కన్వీనర్ పాపోలు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. వారు మాట్లాడుతూ.. లడ్డూ ప్రసాదం కల్తీతో భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. తెదేపా నేతలు అడబాల బాపిరాజు, షేక్ ఇబ్రహిం, సలాది బాపిరాజు, దిడ్డి జనార్దన్, సిద్దా వెంకన్న పాల్గొన్నారు.



ఐ.పోలవరంలో వెంకటేశ్వరుని ఆలయం వద్ద జనసేన, తెదేపా నాయకుల పూజలు

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: హిందూ దేవాలయాల నిర్వహణ బాధ్యతను ధార్మిక సంస్థలకు అప్పగించాలని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి కూడా రామకృష్ణ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌కు ర్యాలీగా చేరుకున్నారు. సంయుక్త కలెక్టర్ అభిషేక్ గౌడకు వినతిపత్రం సమర్పించారు. రామకృష్ణ మాట్లాడుతూ.. తిరుపతి లడ్డూ కల్తీపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. వీహెచ్‌పీ ప్రాంత అధికారి శ్రీకాళహస్తి, జిల్లా సమన్వయకర్త మల్లిబాబు, ధర్మ ప్రచారకులు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



పాడేరులోని కలెక్టరేట్ వద్ద విశ్వహిందూ పరిషత్ సభ్యుల నిరసన